క్లుప్తంగా

రైతుల నమ్మకాన్ని నిలబెట్టండి

పెద్దేముల్: రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మార్కెట్ కమిటీ సభ్యులకు సూచించారు. కోట్‌పల్లి మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి ఎన్నిక కాగా.. వారిని సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు చైర్మన్, వైస్ చైర్మన్ ధన్యవాదాలు తెలిపారు. ఇందులో ఎంపీటీసీ శ్రీనివాస్, మల్లేశం, బందెయ్య, మోపుస్, కిరణ్, అంజిలయ్య, శివారెడ్డిలు ఉన్నారు.

వానపడటమే ఆలస్యం..



ఈర్లపల్లి నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

దుద్యాల్: హరితహారం కార్యక్రమంలో భాగంగా.. మొక్కలు నాటేందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. అందుకు తగిన గుంతలు తీసి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వానాకాలం ప్రారంభంలో కురిసిన జల్లులకు కొన్ని మొక్కలు నాటామని, మిగతా మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నామని పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. వర్షం పడకపోవడంతో భూమి గట్టిగా మారిందని, ఈ దశలో మొక్కలు నాటితే అవి బతకవని తెలిపారు. వానపడటమే ఆలస్యం.. లక్ష్యం మేరకు మొక్కలను నాటుతామని కార్యదర్శి పేర్కొన్నారు.

కరుణించవా వరుణదేవా..



కప్ప కావడితో మహిళా రైతులు

కొడంగల్ రూరల్: తొలకరి జల్లులతో హుషారుగా పొలాల్లో విత్తనాలు విత్తిన అన్నదాతలు.. వరుణుడు ముఖం చాటేయడంతో ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు. మురిపం మొదట్లోనే ఆవిరై ఆందోళన చెందుతున్నారు. వానలు పడక విత్తిన విత్తనాలు భూమిలో మురిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో వర్షాల కోసం కర్షకులు సోమవారం మున్సిపల్ పరిధి కొండారెడ్డిపల్లి గ్రామంలో గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. కప్ప కావడితో మహిళా రైతులు ఇంటింటికీ తిరుగుతూ.. వరుణ దేవా కరుణించవా అంటూ పాటలు పాడారు. కార్యక్రమంలో మహిళా రైతులు మల్లమ్మ, శాణమ్మ, మల్కమ్మ, కాశమ్మ, బుజ్జమ్మ, బుగ్గమ్మ, నర్సమ్మ, ఆశమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పల్లె వెలుగు'కు స్వాగతం



ముజాహిద్‌పూర్‌లో బస్సుకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: పల్లెపల్లెకు పల్లె వెలుగు బస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. సోమవారం పరిగి బస్టాండ్ నుంచి ముజాహిద్‌పూర్, కుల్కచర్ల, చౌడాపూర్, మరికల్, నవాబుపేట మీదుగా మహబూబ్‌నగర్ వరకు ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిధి ముజాహిద్‌పూర్‌లో ఆ బస్సుకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల రవాణా కష్టాలను దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులను తిప్పనుందని తెలిపారు. కాగా.. బస్సు సౌకర్యం కల్పించడంతో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్ కుమార్‌లు హర్షం వ్యక్తంచేశారు.

చెరువుకు కట్టపై భారీ గుంత



పెద్ద చెరువు కట్టపై ఏర్పడిన గుంత

తాండూరు రూరల్: మండల పరిధి అంతారం గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువు కట్టపై భారీ గుంత పడింది. కొంత కాలంగా కురుస్తున్న వర్షాలకు గొయ్యి ఏర్పడగా.. భారీ వర్షం కురిస్తే.. చెరువుకు గండి పడే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. చెరువు కింద వరి పంటను సాగు చేస్తున్నామని, గండి పడితే.. పంట పొలాలు నీటమునిగి నష్టపోతామని ఆందోళన వ్యక్తంచేశారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి, గుంతను పూడ్చాలని రైతులు కోరుతున్నారు.



పరిగి: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు



పెద్దేముల్: మంబాపూర్‌లో..



తాండూరులో.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

ఘనంగా ఈదుల్ అజ్ హా



దోమలో ఎమ్మెల్యే టీఆర్ఆర్ తదితరులు

ముస్లింల అత్యంత పవిత్రమైన పండుగ బక్రీద్ సోమవారం జిల్లాలో ఘనంగా జరిగింది. త్యాగానికి ప్రతీక అయిన పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ఉదయాన్నే భక్తిశ్రద్ధలతో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం పలువురు నేతలు మాట్లాడారు. దైవభక్తి, త్యాగ నిరతికి ఈ పండుగ అద్దం పడుతుందని వ్యాఖ్యానించారు. మతసామరస్యాలకు అతీతంగా బక్రీద్ నిలుస్తుందన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



అనంతగిరి: వికారాబాద్ గంగారం ఈద్గాలో ప్రార్థనల అనంతరం సందేశం వినిపిస్తున్న ఇమామ్



బంట్వారం: తొర్మామిడి ఈద్గాలో..



కుల్కచర్ల: చౌడాపూర్‌లో..



కొడంగల్: అంగడిరాయిచూర్‌లో..



అనంతగిరి: ఎన్నెపల్లిలో..



అనంతగిరి: వికారాబాద్‌లో మహిళా కానిస్టేబుల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు



పూడూరు: మీర్జాపూర్‌లో..



తాండూరు రూరల్: మల్కాపూర్‌లో..



తాండూరు: ఈద్గా వద్ద ఎమ్మెల్యే బీఎమ్మార్, ఎమ్మెల్సీ పట్నం, శుభప్రద్‌పటేల్ తదితరులు

నూతన ఎస్‌ఐగా రవిగౌడ్



దౌల్తాబాద్: నూతన ఎస్‌ఐగా రవిగౌడ్ నియామకం అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్ జిల్లా కేంద్రంలోని డీటీసీకి బదిలీ అయ్యారు. వీఆర్‌లో పని చేస్తున్న రవిగౌడ్.. దౌల్తాబాద్‌కు ఎస్‌ఐగా వచ్చారు. సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు కృషి చేస్తానని తెలిపారు.

నిందితున్ని శిక్షించాలి

పూడూరు: ఇటీవల పెద్దపల్లిలో ఆరేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఇందులో బీజేపీ నాయకులు నవీన్‌జోషి, సుభాన్, జంగయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

20న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఆమనగల్లు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 20న 1 నుంచి 19 ఏళ్ల వయసులోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.పరిక్షిత్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో పంపిణీ చేస్తామని వెల్లడించారు. బడికి వెళ్లని వారికి కూడా మాత్రలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నులిపురుగుల నివారణ మాత్రలను తీసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఇబ్రహీంపట్నం: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ సలహాలు, సూచనలు, సమస్యలు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- వందపడకల ఆస్పత్రికి రూ.17కోట్ల నిధులు మంజూరు

చేవెళ్ల: పేద ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఆయన.. సోమవారం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డయాలసిస్ వార్డును పరిశీలించారు. అక్కడే ఉన్న వైద్యులను ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం డయాలసిస్ కేంద్రంలో సమస్య పరిష్కరించి, రోగులకు డయాలసిస్ సేవలు కొనసాగుతున్నాయని ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ సోమశేఖర్ ఎమ్మెల్యేకు తెలిపారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు.



డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలో రోగులకు గదులు సరిపోవటం లేదని వైద్యులు చెప్పగా.. చేవెళ్ల ఆస్పత్రిని వందపడకలుగా మార్చేందుకు గతంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.17కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో చేవెళ్లలోని ప్రభుత్వ ఆస్పత్రిని అన్ని రకాల వైద్యసదుపాయాలతో నిర్మాణం చేసేందుకు కృషి చేస్తానన్నారు. వందపడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి మండల కేంద్రంలోని అనువైన ప్రభుత్వ భూమిని గుర్తించి, అక్కడ ఆసుపత్రి నిర్మాణం చేయాలనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఆయన వెంట వైద్య సిబ్బంది, నాయకులు ఉన్నారు.

మొయినాబాద్‌లో భారీ వర్షం

మొయినాబాద్: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు సురంగల్, పెద్దమంగళారం, చిలుకూరు, అప్పోజీగూడ, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, కుత్బుద్దీన్‌గూడ, ఎలుకగూడ, మేడిపల్లి తదితర గ్రామాల్లో వర్షం పడింది. సుమారు అరగంటకు పైగా వర్షం కురవడంతో మండల కేంద్రంలో రోడ్లు జలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మొయినాబాద్‌లో సంత ఉండటంతో వర్షం కారణంగా చిరువ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

నృసింహుడి సన్నిధిలో వైస్ చైర్‌పర్సన్



కుటుంబ సమేతంగా వైస్ చైర్‌పర్సన్ దీప

తాండూరు: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని సోమవారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప దంపతులు సందర్శించారు. వారితో పాటు.. కుటుంబ సభ్యులు మాజీ కౌన్సిలర్లు నర్సింలు, పట్లోళ్ల సావిత్రి, ఇద్దరు కూతుర్లు స్వామివారిని దర్శించుకున్నారు.

అభినందనీయం

కొడంగల్ రూరల్: యువత సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మాజీ సర్పంచ్ గోవిందు అన్నారు. మండల పరిధి అంగడిరాయిచూర్ గ్రామంలో సోమవారం అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులకు న్యూట్రిషన్ పౌడర్‌తో పాటు పోషక విలువలు కలిగిన పలు రకాల సరకులను అందజేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. అనాథ పిల్లలు, మతిస్థిమితం కోల్పోయిన వారికి సాయం అందించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చుక్కయ్య, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



చిన్నారులకు న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న మాజీ సర్పంచ్

కలుపు తీతకు సైకిల్

వినియోగానికి ఆసక్తి చూపుతున్న రైతులు

పెద్దేముల్: వ్యవసాయ పనుల్లో కూలీల కొరత రైతులను వేధిస్తుండగా.. కలుపుతీతకు వినియోగించే సైకిల్ పలుగులు కాస్త ఊరటనిస్తున్నాయి. ఉపయోగం పెరగడంతో వాటికీ డిమాండ్ ఏర్పడింది. గతంలో ఈ ప్రాంత కర్షకులు జహీరాబాద్, పరిగి ప్రాంతాల్లో సైకిల్ పలుగులను రూ.2వేలకు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామానికి చెందిన గౌస్ సైకిల్ పలుగులను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఏడాది క్రితం రూ.2500ల వరకు ధర పలికిన సైకిల్.. ప్రస్తుతం సామగ్రి రేట్లు పెరగటంతో.. రూ.300లు పెంచి, రూ.2800లకు విక్రయిస్తున్నట్లు గౌస్ తెలిపారు. ఏటా సుమారు 100నుంచి 150 వరకు సైకిళ్లను విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నలుమూల నుంచి రైతులు యంత్రాన్ని కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎవరికైనా అవసరం ఉంటే.. ముందుగా తెలపాలని తయారీదారుడు అన్నదాతలకు సూచిస్తున్నారు. కూలీల కొరతతో పాటు.. దినసరి కూలి రేట్లు పెరగటంతో.. సైకిల్ పలుగు వినియోగానికి రైతులు ఆసక్తి చూపుతున్నారని, నాలుగు గంటలు ఈ పలుగుతో పొలంలో పనిచేస్తే.. 10 మంది కూలీలతో సమానమని రైతులు పేర్కొన్నట్లు గౌస్ తెలిపారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న సైకిల్

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే



సర్వే నిర్వహిస్తున్న మండల అభివృద్ధి అధికారి సంధ్య తదితరులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధి గ్రామాల్లో మిషన్ భగీరథ ఇంటింటి నల్లా సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య ఆదేశించారు. సోమవారం సెలవు దినం అయినా హిమాయత్‌నగర్ గ్రామంలో అధికారులు చేపట్టిన ఇంటింటి సర్వేలో ఆమె పాల్గొన్నారు. భగీరథ నల్లా కనెక్షన్ ఉన్న ఇంటి యజమాని వివరాలను సేకరించారు. అనంతరం మాట్లాడారు. నల్లాల సర్వేను వేగవంతం చేసి, త్వరలో పూర్తి చేయాలన్నారు. హిమాయత్‌నగర్ గ్రామంలో అధికారుల పనితీరు మరింత వేగవంతం కావాలని చెప్పారు. పరిశీలించిన నివేదికను వెంటనే అందించేందుకు కృషి చేయాలని వెల్లడలించారు. హిమాయత్‌నగర్ పంచాయతీ కార్యదర్శి సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం

కొత్తూరు: బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సోమవారం మున్సిపాలిటీ కౌన్సిలర్ నర్సింలుగౌడ్ ఆయన స్వగ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింలుగౌడ్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం తగ్గిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని కౌన్సిలర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌గౌడ్, నర్సింహా పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

షాద్‌నగర్‌రూరల్: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే యువసత్తా యూత్ లక్ష్యమని యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణానికి చెందిన శ్రీనివాస్ కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో మాదాపూర్ ప్రేమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం శ్రీనివాస్‌కు రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. సోమవారం బాధితుడి కుటుంబ సభ్యులు యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన లక్ష్మణ్‌కుమార్ ఆస్పత్రికి చేరుకొని మ్యాడం నరేశ్, శ్రీకాంత్, నరేశ్, అఖిల్ సహకారంతో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. నిత్యం ఎంతో మంది అత్యవసర సమయంలో రక్తం దొరకకపోవడంతో ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. రక్తదానంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తాన్ని దానం చేయొచ్చన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి శ్రీనివాస్ కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



రక్తదానం చేయిస్తున్న లక్ష్మణ్‌కుమార్

పేరుకే మండలం



గ్రామ పంచాయతీ కార్యాలయం



నూతన తహసీల్దార్ కార్యాలయం

కొత్తగా ఏర్పాటు అయిన మండలం.. వనరుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇలాకాలో ఉన్నప్పటికీ.. అభివృద్ధిలో వెనుకబడింది. పేరుకే మండలం. కానీ.. అన్ని రకాల సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు పూర్వ మండలానికి పరుగులు తీస్తున్నారు.

- అభివృద్ధికి ఆమడ దూరం!
- ప్రభుత్వ కార్యాలయాలు నిల్
- తహసీల్, ఎమ్మార్సీకే పరిమితం
- పనుంటే.. పాత మండలానికి పరుగు
- సీఎం ఇలాకా దుద్యాల దుస్థితి

దుద్యాల్: కొత్త మండలాల ఏర్పాటులో భాగంగా గత ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట మండలాన్ని బొంరాస్‌పేట్, దుద్యాల మండలాలుగా విభజించి, రెండుగా ఏర్పాటు చేసింది. కానీ మౌలిక సదుపాయాలు, వనరుల ఏర్పాటును విస్మరించింది. పేరుకు కొత్త మండల అయినప్పటికీ.. కష్టాలు మునుపటిలాగే ఉన్నాయని, ప్రజాపాలన చేరువ కాలేదని దుద్యాల మండల ప్రజలు పేర్కొంటున్నారు.

నాలుగు మండలాల కలయికతో..

నాలుగు మండలాల పరిధి పలు గ్రామాలను విలీనం చేస్తూ.. దుద్యాల మండలాన్ని ఏర్పాటు చేశారు. బొంరాస్‌పేట మండల నుంచి దుద్యాల్, అల్లిఖాన్‌పల్లి, అంసన్‌పల్లి, చెట్టుపల్లితండా, చిలుముల మైల్వార్, ఎక్కచెరువుతండా, ఈర్లపల్లి, గౌరారం, లగచెర్ల, లగచెర్లతండా, నాజుఖాన్‌పల్లి, సత్తర్‌కుంటతండా, సాగారంతండా, పెద్దబండతండా, కొడంగల్ మండల పరిధి హస్నాబాద్, ఆలేడ్, దౌల్తాబాద్ మండల పరిధి కుదురుమల్ల, కోస్గి మండల నుంచి హకీంపేట్, పోలేపల్లి గ్రామాల కలయికతో.. మండలంగా రూపుదిద్దుకుంది. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం, జడ్పీ పాఠశాలలోని ఒక గదిని విద్యా వనరుల కేంద్రం మినహా.. ఇంకేమీ ఏర్పాటు చేయలేదు. ఇంకా ఎంపీడీఓ, ప్రభుత్వ ఆసుపత్రి, పోలీస్‌స్టేషన్, విద్యుత్, వ్యవసాయ కార్యాలయం, అటవీశాఖ తదతర శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

సీఎంపై ఆశలు

కొత్తగా మండలాన్ని ఏర్పాటు చేశారు. కానీ.. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో గత ప్రభుత్వం విఫలమయిందని, ఏదైనా ప్రభుత్వ కార్యాలయాలతో పని ఉంటే.. పాత మండలానికే వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. సీఎం రేవంత్ నియోజకవర్గంలోని మండలమే అయినా.. సౌకర్యాల లేమితో వెనుకబాటుకు గురయింది. ప్రభుత్వం స్పందించి.. కావలసిన వనరులతో పాటు, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, అన్ని శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేసి, అధికారులను నియమించాలని కోరుతున్నారు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

ఇబ్బందిగా ఉంది

నా పొలం లగచెర్ల గ్రామంలో ఉంది. తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించిన పనులు మాత్రం దుద్యాల్ మండల కేంద్రంలో జరుగుతున్నాయి. మిగతా శాఖలతో ఏదైనా పనుంటే.. పాత మండలం బొంరాస్‌పేటకు వెళ్లాల్సి రావడం ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి.. మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేయాలి. – లక్ష్మి, దుద్యాల్ మండలం